క్లుప్తంగా

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి



బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఊట్కూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేసిమాట్లాడారు.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. ప్రతి గ్రామానికి బీటీరోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, నాయకులు అరవింద్‌కుమార్, విజయసింహారెడ్డి, సుధాకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, సాయిలుగౌడ్ పాల్గొన్నారు.

● కారుగుర్తుకు ఓటు వేసి చిట్టెం రామ్మోహన్ రెడ్డిని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, మక్తల్ ఎన్నికల ఇన్‌చార్జి ఆంజనేయులుగౌడ్ అన్నారు. మంగళవారం మాగనూర్‌లో నిర్వహించిన బైక్‌ర్యాలీలో పాల్గొని మాట్లాడారు.

ప్రజాసేవకే జీవితం అంకితం



నారాయణపేట: నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించేందుకు తమ జీవితం అంకితం చేస్తామని కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో మంగళవారం కార్యాలయం నుంచి ప్రధాన రహదారుల గుండా ద్విచక్రవాహనాలతో ర్యాలీ చేపట్టారు. ఈ మేరకు.. డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. 30న కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటువేసి పర్ణికారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

పోలీసుల దాడి యువకుడికి గాయాలు

ధన్వాడ: మండలంలోని మందిపల్లి కొత్తతండాకు చెందిన లాల్‌సింగ్‌నాయక్‌పై పోలీసులు సోమవారం రాత్రి దాడిచేశారని బాధితుడు ఆరోపించాడు. బాధితడు చెప్పిన వివరాలిలా.. కొల్లంపల్లితండా నుంచి రాత్రి 12.30 గంటలకు మందిపల్లి కొత్తతండాకు తిరిగి వెళ్తుండగా పోలీసులు తనను వెంబడించి కర్రలతో కొట్టారని ఆరోపించాడు. ఈ విషయంపై స్థానిక పోలీసులను వివరణ కోరగా ధన్వాడలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో తాగి బైకును పోలీసులపైకి తీసుకురాగా త్రుటిలో తప్పించుకొని బైకును ఆపాలని కోరగా ఆపకుండా పోలీసులను తోసేసి వెళ్తుండగా పట్టుకుని వివరాలు సేకరించామని గ్రామానికి చెందిన వేరే వ్యక్తిని పిలిచి ఆయనకు అప్పజెప్పామన్నారు. ఇంతకు ముందు తగిలిన దెబ్బలను పోలీసులు కొట్టినట్లు ఆరోపిస్తున్నారని తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు.

కేంద్ర బలగాల కవాతు



గండీడ్: మండల పరిధిలోని వెన్నాచెడ్, రంగారెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఎన్నికల్లో తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్ఐ సురేష్ పిలుపునిచ్చారు.

అమ్రాబాద్: పదర మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఎస్ఐ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఎలాంటి ప్రలోభాలకులోను కాకుండా ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, అధ్యాపకులు శైలేష్, శివకుమార్‌సింగ్, గాలెన్న, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మన్ననూర్: స్థానిక పురుగుల గుట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ప్రకారం అమ్రాబాద్ మండలం బీకే ఉప్పునుంతల గ్రామానికి చెందిన యువకులు అచ్చంపేటలో జరుగుతున్న బైక్ ర్యాలీకి బైక్‌పై ముగ్గురు వెళ్తున్నారు. పురుగులగుట్ట సమీపంలోకి రాగానే ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ట్రాక్టర్‌కు వెనుక భాగంలో ఉన్న నాగలికి తగిలి రోడ్డుపై పడ్డారు. దీంతో రహీం, ఈదయ్యకు స్వల్ప గాయాలు కాగా నల్లబోతుల ఈదయ్యకు తలకు గాయమైంది. బాధితులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పెద్దజీతగాడిలా ప్రజలకు సేవ చేస్తా



బోందల్‌కుంటలో బీజేపీలో చేరిన నాయకులతో మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి

మక్తల్: తనను మక్తల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజల కోసం పెద్ద జీతాగాడిలా పని చేస్తానని బీజేపీ మక్తల్ ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ద్విచక్ర వాహనాల ర్యాలీ కోలార్ ఎంపీ మునిస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, వారికి మరోసారి అధికారం ఇస్తే రాష్ట్రంలో నియంత పాలన కొనసాగిస్తారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్‌పర్సన్ అఖిలారెడ్డి, మాగనూర్ ఎంపీపీ శ్యామలమ్మ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, కౌన్సిలర్లు చీరాల సత్యనారాయణ, ప్రసన్నరెడ్డి, అర్చన, కర్ని లక్ష్మి, కౌసల్య, మండల అధ్యక్షుడు లక్ష్మన్, మండల అర్బన్ అధ్యక్షుడు రాజశేకర్‌రెడ్డి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ద్యావరింటి నర్సింహరెడ్డి, నాగప్ప, ఈసరి నాగప్ప, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని కర్ణాటకలోని కోలార్ ఎంపీ మునిస్వామి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఊట్కూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. భరత్‌నగర్, పాతపేట, మెయిన్ బజార్, శివాజీనగర్ తదితర ప్రాంతాలలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని, ప్రతి కుటుంబానికి దళితబంధు ఇస్తానని చెప్పి ఏ ఒక్క హామీని కూడా ఇప్పటి వరకు నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాదిరెడ్డి పద్మజారెడ్డి, కొండయ్య, భాస్కర్, కృష్ణయ్య గౌడ్, రమేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: బీజేపీ బలపర్చిన అభ్యర్థి జలేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు బీజేపీ కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని మండల ఎన్నికల ఇన్‌చార్జి మహంకాళీ శ్రీనివాస్ అన్నారు. పట్టణానికి చెందిన 30 మంది యువకులు ఇతర పార్టీల నుంచి మంగళవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికీ ప్రచారం చేస్తు బీజేపీ అందిస్తున్న సుపరిపాలన గురించి వివరించామన్నారు. మేర్వరాజు, క్యామ భాస్కర్, అశోక్‌కుమార్, నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మక్తల్‌లో ద్విచక్ర ర్యాలీ చేస్తున్న మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, ఎంపీ మునిస్వామి.



మాట్లాడుతున్న మాదిరెడ్డి జలంధర్‌రెడి

శాంతియుతంగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

● ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట/మక్తల్: శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా తమకు కేటాయించిన పోలింగ్‌కేంద్రం వద్ద అప్రమత్తంగా ఉంటూ బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. మంగళవారం మక్తల్ నియోజకవర్గంలో బందోబస్తుకు వచ్చిన పోలీసులకు మక్తల్‌లోని రాయల్‌ఫంక్షన్‌హాల్లో ఎన్నికల విధివిధానాలు శాంతి భద్రతల పరిరక్షణ అంశాలపై ఎస్పీ భద్రతపరమైన సూచనలు ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల విధులు నిర్వర్తించడానికి వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బంది నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాలలో విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి పనిచేయాలన్నారు. మూడు నియోజకవర్గాలలో 61 రూట్లుగా విభజించి బందోబస్తు వేయడం జరిగిందన్నారు. విధులు నిర్వర్తించే సమయంలో తమకు కేటాయించిన వీధులలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్‌కి ముందురోజు, పోలింగ్‌రోజు, పోలింగ్ తర్వాత రోజుతోపాటు ఎన్నికల ఫలితాలు వచ్చేరోజు వరకు పాటించాల్సిన జాగ్రత్తలు, విధులపై వివరించారు. సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల వద్ద కేంద్రబలగాలతోపాటు లోకల్ పోలీసులు విధుల్లో ఉంటారని తెలిపారు. పోలింగ్ బూత్ వద్ద విధుల్లో ఉన్న పోలీసులు ఎలాంటి సమస్య ఉన్న వెంటనే లోకల్ పోలీసులకు, పెట్రోలింగ్ రూట్ మొబైల్ వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించడంతోపాటు గతంలో జరిగిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని, సమస్యలు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, కమండెంట్ విశ్వనాథ్, డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు , ఎస్ఐలు, కేంద్ర సాయుధ బలగాలు, జిల్లా పోలీసులు, కర్ణాటక , ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన పోలీసులు ఉన్నారు.

సాగునీరు అందించి తీరుతాం



నారాయణపేటలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: ప్రజా సంక్షేమం... అభివృద్ధి బాటపట్టించిన సీఎం కేసీఆర్‌నేతృత్వంలో రాష్ట్రంలో మరో సారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతున్నదని...ప్రజాధారణతో హ్యాట్రిక్ సాధించడం ఖాయమని బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు కావడంతో జిల్లా కేంద్రంలోని బారంబావి నుంచి పెద్ద ఎత్తున భారీ ర్యాలీ చేపడుతూ ప్రధాన రహదారి గుండా గులాబీ శ్రేణులు కారు గుర్తుకు ఓటేద్దాం.. ఎస్ఆర్‌రెడ్డిని గెలిపిద్దాం అంటూ నినాదాలతో హోరెత్తించారు.

అనంతరం స్థానిక సత్యనారాయణ చౌరస్తాలో ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రలు పన్నినా నారాయణపేట గడ్డపై గూలాబీ జెండా ఎగరడం ఖాయమని మళ్లీ తొడగొట్టి చెబుతున్నాన్నారు. రాబోయే పది నెలల్లో పాలమూరు రంగారెడ్డి ద్వారా సాగునీరు అందించి రైతుల పాదాలు కడిగి రుణం తీర్చుకుంటామన్నారు. రాదనుక్న నారాయణపేటను జిల్లాను సాధించి అన్ని రకాలుగా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇటీవల నారాయణపేటకు వచ్చిన రేవంత్‌రెడ్డి ఎన్ని పార్టీలు మారాడో చెప్పాలన్నారు. శివకుమార్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఎందుకు రాలేదనేది, డీసీసీ అధ్యక్ష పదవి నుంచి ఎందుకు తొలగించారో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. పక్కనే ఉన్న కర్ణాటకలో ఇచ్చిన ఐదు గ్యారంటీలు ఏమయ్యాయో ఈ ప్రాంత ప్రజలకు తెలుసన్నారు. నర్సిరెడ్డి పేరు చెప్పుకొని మంచి పేరున్న పెద్ద మనిషిని కాంగ్రెస్‌నాయకులు బద్నాం ఎందుకు చేస్తారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఓటమి భయంతోనే వ్యాపారస్తులపై ఐటీ దాడులు జరిగేలా ప్రేరేపించారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఇక్కడ ఐదు మంది ఎమ్మెల్యేలుగా చలామణి అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జ్ దేవరి మల్లప్ప పాల్గొన్నారు.



భారీగా హాజరైన జనం

కేసు నమోదు

హన్వాడ: మండలకేంద్రంలో ఈ నెల 24న రోడ్డుప్రమాదంలో బొలేరో ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి నాయక్ పేర్కొన్నా రు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ మండలం వెంకటాపూర్‌నకు చెందిన డోకూర్ తిర్పతమ్మ, ఆమె కుమారుడు గణేష్ బైక్‌పై హన్వాడలోని బంధువుల ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న బొలేరో ఢీ కొట్టడంతో తల్లీకొడుకులు కిందపడ్డారు. గణేష్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా చికిత్స నిమిత్తం అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. మంగళవారం అతని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్, వెల్దండ, ఊర్కొండ, పదర, వంగూరు మండలాల్లో మంగళవారం ప్రత్యేక పోలీసు బలగాలతో కలిసి స్థానిక ఎస్ఐల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 132 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా అధికారులు గుర్తించారు. అన్ని కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ మోహన్‌కుమార్ వెల్లడించారు. పోలింగ్ సమయం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ప్రజలు గుంపుగా ఎక్కడ ఉండకూడదని సూచించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని, ఎవరైన ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షేమమే కాంగ్రెస్ అజెండా



మక్తల్‌లో నిర్వహించిన రోడ్ షో లో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి

మక్తల్: నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం అంబేద్కర్‌చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలందరూ నిబద్ధతతో పనిచేయాలని కోరారు. పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ఇంటింటి ప్రచారం చేశారు. మక్తల్ మండలంలోని పంచదేవ్‌పాడు సర్పంచ్ కల్పన వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలక్రిష్టారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, గడ్డంపల్లి హన్మంతు, మాన్వే రామరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోళ్ల వెంకటేష, గణేష్‌కుమార్, రవికుమార్, చంద్రశేఖర్‌గౌడ్, తాయప్ప పాల్గొన్నారు.

అమరచింత: మండల కేంద్రంలో మంగళవారం టీడీపీ నాయకులు కాంగ్రెస్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి కాంగ్రెస్ నాయకులతో కలిసి మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. మోదీమనోహర్ రాజు, గోపాల్‌యాదవ్, కురుమన్న, అయూబ్‌ఖాన్, పురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మక్తల్ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అభివృద్ధి జరుగుతుందని మక్తల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంతో పాటుగా అచ్చంపేట, పెగడబండ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మాగనూర్‌లో ఆయనకు కార్యకర్తలు, మహిళలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ర్యాలీ అనంతరం బస్టాండ్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో కనీస రోడ్డు సౌకర్యం కల్పించలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని ధ్వజమెత్తారు. వాగులో ఇసుక అమ్ముకనే దానిపై ఉన్న దృష్టి రైతులకు సాగునీరు అందించడంలో లేదని ఎద్దేవా చేశారు.

కున్సిలో..

కృష్ణా: మండలంలోని కున్సి గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరికి ఓటు వేసి గెలుపించాలని కోరారు. కార్యక్రమంలో రాజప్పగౌడ, రాంలింగప్ప, అంజప్పగౌడ్, నాగేందర్, పల్లె సురేష్, శ్రీనివాసులు ఉన్నారు.

నర్వ: మక్తల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం తథ్యమని మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయికోడ్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ బడుగు బలహీనవర్గాల అభ్యర్థి వాకిటి శ్రీహరిని గెలిపిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపిస్తారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, సర్పంచ్ సుశీల శ్రీనివాసులు, ఉప సర్పంచ్ తాయన్నగౌడ్, మల్లేష్‌యాదవ్, ఆంజనేయులుగౌడ్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాగనూర్‌లో మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి



కున్సిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బడుగుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే



కృష్ణాలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు



నర్వలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్ననాయకులు

నర్వ: పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మజ్యోతిరావుపూలే అని బీసీ సంఘం అధ్యక్షుడు అయ్యలప్పయాదవ్ అన్నారు. మంగళవారం బీసీ సంఘం భవనంలో జ్యోతిరావుపూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. మహాత్మజ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే నిరంతరం పేదల అభివృద్ధి కోసం కృషిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు హన్మంత్‌రెడ్డి, అయ్యలప్ప, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని హిందూపూర్, ముడుమాల్ గ్రామాల్లో మంగళవారం మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతిని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటప్ప, హిందుపూర్‌లో అంబేద్కర్ సంఘం నాయకులు సుబాష్, బుషప్ప, అనిల్ కుమార్, అంజప్ప, అశోక్, నర్సింహులు, పరమేష్ పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మహాత్మా జ్యోతిబాపూలేకు వర్ధంతి సందర్భంగా మంగళవారం మున్సిపాలిటీలో ఘన నివాళి అర్పించారు. బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ నేతృత్వంలో ఎమ్మార్పీ కార్యాలయం వద్ద, ఉమెన్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలోనూ కార్యక్రమాలు నిర్వహించారు.



జడ్చర్లలో..

ఆ పాఠశాలలకు సెలవు

జడ్చర్ల టౌన్: సాధారణ ఎన్నికలు పురస్కరించుకుని పోలింగ్ కేంద్రం ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటించినట్లు ఎంఈఓ మంజులాదేవి తెలియజేశారు. గురువారం మాత్రం అన్ని పాఠశాలలకు సెలవు ఉందని ఆమె వివరించారు.

వాహనాల తనిఖీలు

తాడూరు: మండలంలోని మేడిపూర్ దగ్గర ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. మంగళవారం తనిఖీ అధికారి వాలేందర్ నాయక్ ఆధ్వర్యంలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

అంజన్న సాక్షిగా హామీ ఇస్తున్నా..



మక్తల్: నియోజకవర్గంలో ఉచిత వైద్యం అందించేందుకు కృషిచేస్తానని, రెండు ప్యాక్టరీలు తెచ్చి రెండున్నరేళ్లలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. మక్తల్‌లోని పడమటి ఆంజనేయస్వామి సాక్షిగా బాండ్ పేపర్ రాసి ప్రమాణం చేసి స్వామివారి ముందు సంతకం చేశారు. మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ మక్తల్ ప్రజలు బీఎస్పీ వైపు చూస్తున్నారన్నారు. ఉచిత విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, ఈసారి ఎన్నికల్లో డబ్బులు, మద్యంకు లొంగిపోయి ఓటు వేయొద్దని, తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు.